తెలిసి చేసినా, తెలియకనే చేసినా అన్యాయం అన్యాయమే. ప్రాయశ్చిత్తం అనుభవించకనూ తప్పదు. అంతటితో ఆ కథ పరిసమాప్తం అవుతుందని ఆశించడం మాత్రం పొరపాటు.

---

పౌర్ణమి;
కారుమబ్బు
జాన్
గోపాలం
'ఐ....
జాన్ నవ్వాడు.
చుట్టపొగ ఉంగరంలాగా బయ
కలిసిపోయింది.

'మద్రాసులో చాలాకాలం ఉన్నాను...అక్కడ తెలుగు నేర్చుకున్నా' న్నాడు జాన్.



గోపాలం మెదలకుండా పెడలు తొక్కుతున్నాడు. ఒక క్షణం ఆగి 'మీది...ఏ దేశం సార్...' అని అడిగాడు.

'ఇంగ్లీషువాణ్ణి నేను....'

'ఏం పనిమీద వచ్చారు సార్...'

'మొన్న సింగపూర్‌నుంచి షిప్పు వచ్చింది... అందులో వచ్చాను.....ఇంకో వారం రోజు లుంటానులే ఇక్కడ......'

'రిక్షా ఎటు పోనిమ్మంటారు సార్...'

'ఊరు నాకేం తెలుసు... నువ్వే చూపించాలి.' జాన్ నవ్వుతుంటే దగ్గుతున్నట్లుంది.

'షిప్పులో కూర్చుంటే తోచలేదు...అందు కని ఇట్లా బయలుదేరాను....'

జాన్ చుట్టను పంటికిందపెట్టి మాట్లాడు తున్నాడు.

'నీ పేరేమిటి...'

'గోపాలం.....'

# అన్వేషితులు

'నాపేరు జాన్...'

'సార్...'

జాన్ మళ్లీ నవ్వాడు. నవ్వుతోపాటు దగ్గు దొంతర్లుగా వచ్చింది. చాలా బలహీనంగా ఉన్నట్లు కనిపించాడు. ముఖంమీద సన్నగా ముడతలు పడ్డాయి.

గోపాలం తొక్కకుండానే రిక్షా వాలులో పోతూంది. మధ్య మధ్య ఉరుములు, మెరుపులు వస్తున్నాయి.

వానవచ్చేటట్లుగా ఉంది.

ఉండి ఉండి ఒక్కసారిగా 'నేను చాలా చెడ్డ వాణ్ణి గోపాలం....' అన్నాడు జాన్.

'అదేమిటి సార్....'

'నీకేం తెలుసు నా సంగతి..వ్స్..'

'తమాషాగా మాట్లాడతారు సార్...మీరు...'

జాన్ చుట్ట కింద పారేసి ఉమ్మేశాడు.

'ఒళ్లంతా ఇదిగా ఉంది....గోపాలం...కొంచెం లోపలకు ఏం దొరకదూ.....'

గోపాలం వెనక్కు తిరిగి నవ్వాడు.

'ఎందుకు దొరకదు సార్... దానికి దుకాణం అంటూ లేదుగాని.... దొరికే చోటుకు తీసుకుని పోతానుగా....'

'ఊ....పోనీ అట్లాగయితే....'

గోపాలం మెల్లిగా రిక్షా ఒక సందులోకి తీసుకెళ్లి అక్కడినుంచి నాలుగైదు మలుపులు తిప్పి ఒకపూరి గుడిసె ముందు ఆపాడు. చూరు నేలకు తగిలేటట్లుగా ఉంది. రోడ్డుకంటే ఇల్లు పల్లంగా ఉంది. వంగి ఇంట్లోకి వెళ్లారు ఇద్దరూ.

'ఏం కావాలండి...'

'సార్ వచ్చారు..' అన్నాడు గోపాలం. వచ్చి నతను గోపాలం వంక చూశాడు.

'నీ కేం భయంలేదులే... నే ఉన్నాగా...' అన్నాడు గోపాలం.

సారాబుడ్లు వచ్చినాయి.

తీగెకు తగిలించిన లాంతరు తెచ్చి పక్కనే ముక్కాలు పీటమీద పెట్టాడు.

'నువ్వుగూడా తీసుకో..' అన్నాడు జాన్.

'అబ్బె. వద్దు సార్..'

'అదేమిటి...?' అన్నాడు జాన్. 'హాఁ.... మీవాళ్లంతా అంతే...మమ్మల్ని తాగిస్తారు... మీరు తాగరు... మేం పాడయిపోవాలని మీ ఉద్దేశం...సరే కానియ్యండి. ఏం చేస్తాం......' జాన్ గబగబా సీసా ఖాళీ చేశాడు.

'మాది ఇంగ్లండు...తెల్లవాడంటే గొప్ప వాడని మీ ఉద్దేశం...., అంతేనా?' జాన్ నవ్వితే రెండు బంగారు పళ్లుకూడా కనిపించాయి. కొంచెం తూలుబాటు వస్తూంది. మళ్లా చుట్ట ముట్టించాడు.

'ఇక్కడినుంచి ఎటు తీసుకుని పోతున్నావు..' గోపాలాన్ని అడిగాడు దుకాణం మనిషి.

'ఇంకాఏమీ అనుకోలేదు..' అన్నాడు గోపాలం.

'అన్నట్టు..నిన్ను అడగలేదు గదూ.. రాధని.. అ..... రాధాదేవి ! అని ఉంది తెలుసా మీకు..'

'ఏ రాధాదేవి సార్..'

జాన్ జేబులు తడుముకున్నాడు.

'ఫొటో మరిచిపోయాను.... షిప్పులోనే ఉన్నట్లుంది.... సన్నగా... పొడుగ్గా...నల్లగా ఉంటుంది. . .నల్లగా ఉంటే మటుకు ఏం?... ఎంతెంత కళ్లని? తెల్లటి తెలుపు.... పెద్ద.... పెద్ద కళ్ళు... ఇంతంత ఉంటాయి...' జాన్ చేతులో్తో చూపిస్తున్నాడు.. 'మద్రాసునుంచి వచ్చింది.... పేరుచెప్పాగదూ...రాధ...రాధాదేవి... ఆ... అంతే... కరెక్టు..'

గోపాలం, సారాదుకాణం మనిషి ఒకళ్లముఖం ఒకళ్లు చూసుకున్నారు.

'వెతుకుపోయి కనుక్కుందాం సార్..' అన్నాడు





కావలి

చిత్రం—ఎ. ఎస్. ప్రకాశరావు (అనకాపల్లి)

గోపాలం.

'ఇంకెక్కడికి పద్దు తెలిసిందా? ఇప్పుడే చెబుతున్నా....' జాన్ కళ్ళు ఎఱ్ఱబడ్డాయి. లేవబోతూ తూలిపడ్డాడు.

సారాదుకాణం మనిషి గోపాలాన్ని పిలిచి ఏదో రహస్యంగా చెప్పాడు. జాన్ పదిరూపాయల కాగితం తీసి చాపమీద పడేశాడు. తను లేవబోయి మళ్ళీ పడ్డాడు.

'కొంచెం చెయ్యి అందుకో గోపాలం..' జాన్ చెయ్యి చాచాడు. గోపాలం చెయ్యి పట్టుకుని అతన్ని పైకి లేవతీశాడు. జాన్ చెయ్యి తగలగానే గోపాలానికి షాక్ తిన్నట్లయింది. అతని ఒళ్ళు పేలిపోతూంది.

'మీకు ఒంట్లో బాగాలేదా సార్...'

'బాగానే ఉంది...రాధ కనబడితే పూర్తిగా బాగయిపోయేది.. కొంచెం ఈ పిస్టలు పట్టుకో.' జాన్ పిస్టల్‌ను గోపాలాని కిచ్చి జారిపోతున్న లాగును పైకి లాక్కున్నాడు.

రిక్షా బయలుదేరింది.

గోపాలం కొంతదూరం పోయిన తర్వాత రెండు మూడు కిళ్ళీకొట్ల దగ్గర ఆగి 'రాధాదేవి' గురించి విచారించాడు. వివరం తెలియలేదు. ఒక ఇల్లు చూపించారుగాని జాన్ అనుకున్న రాధాదేవి కాదు. ఇంకెవరో ఉన్నారు.

'రేప్పొద్దున పోదురుగాని...' అంది ఆమె.

గోపాలం వినవిని కిందకు దిగి వచ్చాడు.

'సరే. ఏం చేస్తాం.. మళ్ళీ వెతుక్కు తీసుకుని పో..' అన్నాడు జాన్.

టైము చాలా అయిపోయింది.

'మీకు జ్వరం ఉన్నట్లుంది సార్..'

'అవును గోపాలం.. ఒక చిన్న ఉపకారం చేస్తావా?...డబ్బిస్తాను గాని..'

'డబ్బుకేముచ్చె.. అసలు చెప్పండి సార్..'

'ఈరాత్రి షిప్‌లోకి పోవటానికి కుదరదు... మామూలుగా అయితే ఎక్కడో అక్కడ రాత్రి గడిపేసేవాణ్ణి.. నాకు ప్రాణం ఏమీ బాగా లేదు... ఎక్కడున్నా పడుకోవటానికి కొంచెం చోటు దొరికితే....'

గోపాలం తికమక పడ్డాడు.

జాన్ ఒక్షణం ఆగి 'మీ ఇంటికి తీసుకుని పోరాదూ..' అన్నాడు. 'నీకేం భయం అక్కర్లా.. ఈ పిస్టలు నీదగ్గర ఉంచుకో... నేనేమన్నా పిచ్చిపనిచేస్తే దాంతో కాల్చేద్దువుగాని.. సరేనా..'

జాన్ గొంతు తడబడుతూంది. మనిషి వణుకుతున్నాడు. 'ఇంకా ఏమిటి అనుమానం?'

ఏమి చెయ్యటానికీ పాలుపోలేదు గోపాలానికి. జాన్ జ్వరతీవ్రంలో ఉన్నాడు. అతనికి సహాయం చేస్తే తప్పేమీ లేదు. తను తీసుకెళ్లి తనింట్లో రాత్రి పడుకోనిస్తే గూడెంవాళ్లంతా ఏమనుకుంటారు? ! తెల్లవాడు ! ! తెల్లవాళ్ల గురించి ఆ గూడెంలో అభిప్రాయ భేదం లేదు. అందరిదీ ఒకేమాట.

కాని తనకు వాళ్లతో ఉన్న సంబంధం వేరు. ఓడల్లో ఎంతమందో దిగి వస్తూంటారు. వాళ్లకు కావల్సిన ఏర్పాట్లన్నీ తను స్వయంగా చేస్తాడు. కానీ తను కనీసం సారాయి రుచి గూడా చూసి ఎరగడు. తనది వ్యాపారం. అంతకంటే అందులో తన బాధ్యత ఏమీ లేదు. కాని జాన్ పరిస్థితి వేరుగా ఉంది. ఇప్పుడు పోయి ఏ అరుగుమీదన్నా పడుకుంటే అతని పని ఏమవుతుందో ఏమో !

జాన్ బాగా దగ్గుతున్నాడు.

గోపాలం ఒక నిర్ణయానికి వచ్చాడు.

'అట్లాగే. మా ఇంటికి పోదాం రండి సార్...' అన్నాడు.

జాన్‌కు ప్రాణం లేచివచ్చింది. 'పద..పద..' అన్నాడు.

గోపాలం రిక్షా వేగంగా తొక్కాడు. రొప్పుతూ, రొస్తూ ఇంటి ముందుకు తీసుకెళ్లి బ్రేకులు వేశాడు. చెయ్యి పట్టుకుని జాన్‌ను మెల్లిగా దించాడు. దర్వాజాదగ్గర మెల్లిగా వంగి, మోపంతా గోపాలంమీద మోపి మెల్లగా అడుగులు వేశాడు. వెళుతూనే చాపమీద కూలబడ్డాడు. గోడఆనుకుని ఒక కాలు కొంచెం ముడుచుకుని మోకాలుమీద చెయ్యి వేసుకున్నాడు.

'గోపాలం...'

'ఏమిటి సార్..'

'నువ్విక్కడికి తేబోతే నావని ఏమయ్యేది..' అన్నాడు.

ఒక్కక్షణం ఆగి విస్మయంగా చూశాడు.

'అమ్మా, నాన్నా యుద్ధంలో చనిపోయారు. ఒక్కణ్ణి. ఓడలో చేరాను... రాధ కనబడలేదు... ఇంకో రిక్షావాడయితే వీధిలో దించేసి వచ్చేవాడు...చచ్చేవాణ్ణి...ఆ... ఇదిగో... తుపాకి నీ దగ్గరే ఉంచు..ఒంట్లో బాగా లేదు కాబట్టి ఇలా మర్యాదగా మాట్లాడుతున్నా గాని, చాలా చెడ్డవాణ్ణి..'

మాట్లాడుతూ ఆయాసపడుతున్నాడు. గోడకు చేరగిలబడి గట్టిగా నిట్టూర్చాడు.

ఏవో దీపం పురుగులు ఇల్లంతా ఎగురుతున్నాయి. బల్లులు గోడమీద స్వైరవిహారం చేస్తున్నాయి.

'మళ్లీ మరిచిపోతానేమో.. ఈ పది రూపాయలు దగ్గరుంచు..' అన్నాడు జాన్. .

'అంతెందుకండి..'

'నా ప్రాణానికి అంతమాత్రం విలువన్నా ఇయ్యాలే... నేను నిన్ను నమ్మగలను తెలుసా..'

'మీరు పడుకోండి.'

'రమ్మ కేముచ్చెగాని.. నా కథంతా విను..'

'రేప్పొద్దున చెబుదురుగాని సార్..'

'అప్పుడు మళ్లా చెబుతాను లే.. రాధాదేవి ఎవరో చెప్పలేదుగా నీకు... ఈపాటికి చచ్చిపోయి ఉంటుందిలే... ఎవరో ఈ ఊరొచ్చింది... అంటే ఏమోలే అనుకున్నా..' గోపాలం మెదలకుండా బయటకు వచ్చేశాడు.

సత్తెయ్య ఎదురయ్యాడు.

'తెల్లోడు ఎవరో వచ్చాడంటగా మీ ఇంటికి......'

'అవును..' అన్నాడు గోపాలం ముభావంగా.

'ఇదంతా సానిగూడెం చేద్దామనుకుంటున్నావా...ఎట్లా?' సత్తెయ్య మెల్లిగానే అడిగినా ఆమాట నిప్పులాగా తాకింది గోపాలానికి.

'సత్తెయ్యా..? !' అంటూ బిగ్గరగా అరిచాడు.

'బ్రతిగొడ్డులాగా అట్లా అరుస్తావెందుకురా? నీ రిక్షావ్యాపారం ఎవరికీ తెలియదనుకున్నావేమిటి... ఏదో, ఎందుకులే అని ఊరుకుంటుంటె... సరాసరి గూడెంలోకి తెచ్చావు... ! ! అయ్...' సత్తెయ్య చెయ్యెత్తాడు.

గోపాలం చికాకుపడ్డాడు. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో చిక్కుకుంటాడని పద్ద అనుమానం

నిజమయింది.

'అదిగాదు సత్తెయ్యా.. జ్వరంగా ఉంటే ఇక్కడ తెచ్చాను...రేప్పొద్దున్నే పంపేస్తాను...'

'జ్వరంగా ఉంటే ఇక్కడెందుకురా.... ఏ చెట్టుకిందన్నా దించెయ్యక...'

'జ్వరం బాగా ఉంది సత్తెయ్యా..'

'ఎక్కువయితే చస్తాడు.. అంతేనా..ఆళ్లంతా చస్తేమటుకు ఏంరా....'

గోపాలం మనస్సు చివుక్కుమంది.

'వాళ్లనని ఏం ఉపయోగం రా.. కొంపకు కొరివి పెట్టేవాడివి నువ్వుండగా.. పుల్లయ్య కూతురు సంగతి మరిచిపోయావటరా. తెల్లోళ్ల చేతుల్లో పడేగదంటరా... సముద్రంలో పడి చచ్చిపోయింది... అసలు నువ్వు అడ్డంలేరా.. వాణ్ణే తన్ని తగలేస్తాను..' సత్తెయ్య గోపాలాన్ని వెనక్కు తోశాడు.

'ఆగు..' అంటూ హుంకరించాడు గోపాలం. 'ఇది నా ఇల్లు...నా యిష్టంవచ్చినట్లు చేస్తాను' అన్నాడు ఆవేశంగా.

'ఇల్లు నీదే రా... గూడెంగూడా నీదేనటరా...

## ఆన్వేషితులు

కమల ఇంట్లో ఉందా...'

'ఉంది..'

'వీడు రావటం దానికిగూడా ఇష్టమేనా...'

'సత్తెయ్యా...? !'

'నీసంగతి రేపు తేలుస్తానుండు.. ధూ... వెధవబ్రతుకులు.....'

సత్తెయ్య తుపుక్కున ఉమ్మేసి వెళ్లిపోయాడు.

గోపాలం తలవంచుకుని లోపలకు వచ్చాడు.

'ఎవరు వచ్చింది..?' జాన్ అడిగాడు.

'ఎవరూ లేరు..' గోపాలం తలపాగ విప్పదీసి దులిపి భుజంమీద వేసుకున్నాడు.

'అంతా వినబడింది.. నేను వెళ్లిపోతానుః గోపాలం. ప్రాణంమీద తీపి నన్నిలా తెచ్చింది... ధూ...లేకపోతే వచ్చేవాణ్ణేకాదు...'

'మీరు మెదలకుండా పడుకోండి సార్...'

గోపాలం వినుక్కున్నాడు.

'గోపాలం...నాసంగతి విను.. విన్న తర్వాత గూడా నేనిక్కడ ఉండవచ్చు అనుకుంటే సరే... లేకపోతే వెళ్లిపోతాను.'

గోపాలం మెదలకుండా చాపచివర కూర్చున్నాడు.

'నువ్వీ రిక్షాపని మానుకో గోపాలం. ఏదన్నా వ్యాపారం చేసుకుని బ్రతుకు.. రిక్షాపని మటుకు వద్దు.. రిక్షాపని పెట్టుకున్నా తెల్లవాళ్లను మటుకు దగ్గరకు రానియ్యద్దు. ఒకసారి మద్రాసులో ఏమయిందో తెలుసా? వీబోటి వాడే తీసుకెళితే ఒక ఇంటికి పోయాను...రాధ అక్కడ ఉంది....బాగా తాగి ఉన్నానేమో.. నా ఒళ్లు నాకు తెలియలేదు...రాధ బ్రతిమలాడింది.. తిట్టింది. అభిమానంగల పిల్లని తర్వాత తెలిసింది...నన్నుచూడు..దున్నపోతులాగా ఉన్నాగదూ ...రాధ బెదిరింపులు ఎందుకూ పనికిరాలేదు.పశువులాగా ప్రవర్తించాను. ఆ రాధ మద్రాసు నుంచి ఇక్కడకు వచ్చిందని విన్నా.. నాకు ఎవరూ లేరని చెప్పానుగా....చివరకు రాధను నాతోపాటు తీసుకుని పోదామనుకున్న తర్వాత రాధ కనబడనే లేదు...ఇక్కడ వెతికాంగదూ.. నీకు కనపడితేమటుకు చెప్పు... అయినా ఏం కనబడుతుంది లే.... ఇక్కడకు వచ్చిందని అన్నారుః గాని...దేంట్లో అన్నాదూకి చచ్చిపోయి ఉంటుంది.. ప్చ్.... అంతేలే...అంతా నామాదిరిగా దులపరించుకుని తిరుగుతారూ. ఏం గోపాలం. వింటున్నావా...ఊఁ.. రాధ కనబడితే చెప్పు..'

జాన్‌కు ఆయాసం ఎక్కువయింది. ముఖం జేవురించింది. 'నాకెప్పుడన్నా ఇలాఅవుతూఉంటుందిలే..' అన్నాడు.

తుపాకి నేలమీద పడింది.

గోపాలం, కమల అవ్వంతిని వరండాలో పడుకున్నారు.

'పాపం చాలా సుస్తీగా ఉంది ఆయనకు..' అన్నాడు గోపాలం.

'ఊఁ..' అంది కమల.

'సత్తెయ్య వచ్చి నానామాటలూ అని పోయాడు.....'

'ఉహూఁ...'

'ఆయనిక్కడ పడుకోవటం నీ కిష్టంలేదా...'

కమల గోపాలం వంక తీక్షణంగా చూసింది.

'రేప్పొద్దున్నే వెళ్లిపోతాడుగా..' అన్నాడు గోపాలం.

'మీ ఇష్టం..' అంది కమల.

'నీకూ ఇష్టం లేదులే. నీ మాటల్లోనే తెలుస్తోందిగా... చస్తుంటే 'రామరామ' అంటం కూడా తప్పే...'

'నా కిష్టం లేదని ఎవ రన్నారు...?'

'ప్రత్యేకం చెప్పాలేమిటి.. వాలకం తెలియటంలా. పుల్లయ్య కూతురు చచ్చిపోయిందనేగా?'

'ఆసంగతులన్నీ ఇప్పుడెందుకు...'

'సరేలే..పడుకో..' గోపాలం చివ్వుమని వెనక్కు

మీకిష్టమైన నూనెల్లో నానబెట్టుడు

కాష్మీర్-కుసుం

కేశములను పెరిగించును. అకాలనెరను మాన్పును.

చెరుపు ఉపద్రవములకు

సొంటలక్స్ ములాము

చెరుపు అపాయములకు

నంజనగూడు పండ్లపొడి & అపూర్వ ఔషధములు

నన్ జన్‌గూడు ఔషధములకు ఒక టవునుకు ఒక స్టాకిస్టును ఆహ్వానించెదము




## పూవు మీ అదృష్టం చెప్పగలదు

నీ భవిష్యత్తులో ఏమి జరగబోతున్నదిన్నీ, నీ సరియైన చర్యను గురించిన్నీ నీవు తెలుసుకొన గోరినట్లయితే ఒక పోస్టుకార్డుపైన నీకు ఇష్టమగు ఒక పుష్పము పేరున్నూ, నీవు వ్రాయు తేదీ, వేళ వివరములున్నూ, నీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసి పంపుము.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి నీవు కార్డు వ్రాసిన తేదీ లగాయితు 12 మాసములలోని నీ యొక్క అదృష్టము, లాభనష్టములు, జీవిత మార్గము, ఏ వ్యవహారములో నీకు జయము కలుగునో, నీ ఉద్యోగం విషయంలో మంచి చెడ్డలు, మార్పులు, ఆరోగ్య విషయము, పరదేశ గమనము, తీర్థయాత్రలు వివాహము, స్త్రీ సుఖము, సంతానము, నిధి నిక్షేపములు, లాటరీ, ఆకస్మాత్తు ద్రవ్య లాభము మొదలగు వానిని గురించి స్పష్టంగా మాసవారీగా వ్రాసి రు. 1—4—0 లకు మాత్రము వి. పి. గా పంపగలము. వి. పి. చార్జీలు ప్రత్యేకం. దుష్టగ్రహము లేవయినా వున్న యెడల శాంతిచేయు విధానం కూడా తెలుపగలము. వివరములు మాపూచీపైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకం వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

**Pt. Dev Dutt Shastri, Raj Jyotishi (AW-3) Jullundur City**



అర్జునుని తపం — ఫోటో—సంపతి (అనంతపురం)

తిరిగాడు. 'అడ్డమైన వాళ్ళా కొంపలో ఎందుకు అని గొణుక్కుంది కమల.

జాన్ తెల్లవార్లూ కలవరించాడు.

ఒకసారి మటుకు 'రాధా' అంటూ బిగ్గరగా అరిచాడు.

కమల ఉలిక్కిపడి లేచింది. గోపాలం విశ్రాంతిగా నిద్రపోతున్నాడు. ఒంటరిగా గదిలోకి పోవటానికి భయం వేసింది. పుల్లయ్య కూతురు దారికి అడ్డంగా నిలబడ్డట్లు తోచింది. గుండె దిటవుచేసుకుని లోపలకు వెళ్ళింది.

జాన్ కళ్ళు మూసుకుని పలవరిస్తున్నాడు.

'వచ్చావా...'

'ఏం కావాలి మీకు..' అంది కమల.

జాన్ కళ్ళు తెరిచాడు. కమల వంక కళ్ళు చికిలించి చూశాడు. కళ్ళు మూసుకుని మళ్ళా తెరిచాడు. ముఖంమీద చెమట పట్టి ఉంది. పెదిమలు తడబడుతున్నాయి. ముఖం పక్కకు తిప్పేసుకునిపడుకుని ఏడవటం మొదలుపెట్టాడు జాన్. కమలగుండె దడదడలాడింది. గబగబా బయటకు వచ్చేసి లోపలకు చూసింది. జాన్ తుపాకిని గుండెలదగ్గరకు లాక్కున్నాడు.

గోపాలంమసిలాడు. 'లేచావెందుకు?' అన్నాడు.

'ఆయన పెద్దగా అరిస్తే చూద్దామని వెళ్ళాను..'

'ఊ...' గోపాలం మళ్ళా పడుకున్నాడు.

ఒక రాత్రివేళ గోపాలానికి మళ్ళీ మెలకువ వచ్చింది. కళ్ళు అంటుకొని పోయిఉన్నాయి. బలవంతాన కళ్ళు తెరిచి పక్కకు చూశాడు. కమల అటూ ఇటూ మసులుతూంది. లేచి ఇంట్లోకి వెళ్ళాడు. వెళ్ళినవెంటనే వెనక్కు పరుగెత్తుకొచ్చాడు.

'ఆయనేడీ..?' గోపాలం ముఖం పాలిపోయి తెల్లగా ఉంది.

'లేడా?' కమల అంతకంటె తెల్లపోయింది. గోపాలం కమల వంక సూటిగా చూశాడు.

'రాత్రి ఏమన్నా అన్నావా ఆయన్ను...?'

'నాకేం పని..' అంది కమల.

'నువ్వు ఏదో అని ఉంటావు.. ప్రాణం పోయేట్టుగా ఉంటే కాస్త చోటిస్తే తప్పొచ్చిందా.. అంతమాత్రం ఓర్పు లేదేం నీకు? ఆయనది మటుకు నీప్రాణం లాంటిది గాదూ.. అప్పుడు పడవలోనుంచి పడిపోతే నేను రక్షించకపోతే ఏమయ్యేది నీప్రాణం...'

గోపాలం మండిపడ్డాడు.

'రక్షించమని నేను కోరలేదు....'

గోపాలానికి జుగుప్స కలిగింది.

'ఆమాట అప్పుడు తెలియాల్సింది నాకు..' అన్నాడు.

'చెప్పలేకపోయాను..' అంది కమల. ఆమె మనస్సులో గతంలోని స్మృతులెన్నో పైకి వచ్చినాయి. కళ్లలో నీళ్ళు నిలిచాయి.

'నీకేమన్నా మతిపోయిందా..' గోపాలం నిస్తబ్ధుడయ్యాడు.

ఆ క్షణంలోనే కొద్ది దూరంనుంచి తుపాకి పేలిన చప్పుడు, పెద్దమూలుగు వెంట వెంటనే వినబడ్డాయి. గోపాలం కాళ్ళకింద నేల కదిలిపోతున్నట్లు అనిపించింది.

'ఆ తుపాకే..అతనే..' అంటూ గోపాలం వీధిలోకి పరుగెత్తి పోగాడు.

కమల చెయ్యి అడ్డుపెట్టి వారించింది.

నిర్ఘాంతపోయి కమల వంక చూశాడు. ఆమె కళ్లని.. పెద్ద పెద్ద కళ్లవంక సూటిగా చూడలేకపోయాడు...ఆమె సన్నగా, పొడుగ్గా, నల్లగా కనబడింది.. అతని మనసు కలవరం పొందింది.

హఠాత్తుగా ఆమెను గట్టిగా హృదయానికి హత్తుకొని 'నిజం చెప్పు.. నువ్వు నా కమలే గదూ..' అన్నాడు. కమల కళ్లవెంబడి నీళ్ళు జల జల రాలినాయి.

'మీకు కమలనే..' అంది మెల్లగా. ★